క్లుప్తంగా

లక్ష్య సాధనకు నిరంతరం కృషిచేయాలి



పరీక్ష సామగ్రిని అందిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్ణయించుకొని, దానిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని శంకర్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం శంకర్‌పల్లి కేజీబీవీలో విద్యార్థులకు ఆమె పరీక్ష సామగ్రిని అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠశాల దశలో ఉన్నప్పుడే ప్రతి విషయాన్ని నేర్చుకునేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవకాశం ఉన్నంత మేర సాయం చేసేందుకు ముందుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధురవేణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దశరథ్‌నాయక్

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన నరేశ్‌కు ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ల సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.60 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ జీఎల్‌ఎన్ రెడ్డి, నాయకులు ఆనంద్, రామకృష్ణలు లబ్ధిదారుడు నరేశ్‌కు చెక్కు అందజేశారు.

ప్రమాదబీమాను సద్వినియోగం చేసుకోవాలి

ఐపీపీబీ సీనియర్ మేనేజర్ రాజశేఖర్

కేశంపేట: పోస్టల్ శాఖ అందిస్తున్న ప్రమాదబీమాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) సీనియర్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రమాద బీమాపై మండల కేంద్రంలో ప్రజలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ రాజశేఖర్ పాల్గొని పోస్టల్ శాఖలో ఉన్న ప్రమాదబీమాతో పాటు వివిధ పథకాల గూర్చి వివరించారు. 18 నుంచి 65 ఏళ్ల వయస్సు వరకు ప్రమాదబీమాను పోస్టల్‌శాఖ అందిస్తుందని ఆయన తెలిపారు. వ్యక్తి రూ.555లతో అయితే 10లక్షలు, రూ.755తో అయితే 15లక్షల ప్రమాదబీమాను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాలసీ తీసుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించిన, శాశ్వత అంగవైకల్యం ఏర్పడిన పాలసీ పూర్తి నగదును అందిస్తామని ఆయన తెలిపారు. పాలసీదారుడు మృతి చెందితే తక్షణ అంత్యక్రియల నిమిత్తం 5వేలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమీపంలోని పోస్టాఫీస్‌లో ప్రమాదబీమా పాలసీలను తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, మహేందర్, శ్రీశైలం, ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపిపిబి) పోస్టుమాస్టర్ మీర్జా మౌజామ్ బైగ్, కడియాల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నీ



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, నిర్వాహకులు

ఆమనగల్లు: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మూడురోజులుగా నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ టోర్నీ సోమవారం ముగిసింది. పోటీల్లో విన్నర్‌గా ఆమనగల్లు స్ట్రైకర్స్ టీమ్, రన్నర్‌గా లోకల్ స్టార్ టీమ్ నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్, వాలీబాల్ క్రీడాకారుడు మనోహర్‌రెడ్డిలు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు జగన్, పవన్ కల్యాణ్, రమేశ్, మహేందర్, ఆర్గనైజర్లు దేవేందర్, రవి, సురేశ్, చాంద్‌పాష, గౌస్, భరత్, మల్లేశ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

- నేటి నుంచి కనకమామిడి సంగమేశ్వర ఆలయంలో పూజా కార్యక్రమాలు
- 13న పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



ఉత్సవాలకు ముస్తాబైన సంగమేశ్వర దేవాలయం

మొయినాబాద్ రూరల్: మండలంలోని కనకమామిడి గ్రామ సమీపంలో గల సంగమేశ్వరాలయం ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయానికి రంగులు వేసి ఆకర్షణీయంగా అలంకరించారు. ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఈ సారి కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ మంగళవారం పూజా కార్యక్రమాలు ప్రారంభమై 14వ తేదీ శుక్రవారం ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ చరిత్ర..

ప్రకృతి అందాల మధ్య కొలువుదీరిన సంగమేశ్వర దేవాలయం భక్తులకు ఆధ్యాత్మికత, ఆహ్లాదాన్ని పంచుతోంది. భక్తుల కోర్కెలు తీరుస్తూ కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. మండలంలోని కనకమామిడి గ్రామ సమీపంలో సంగమేశ్వర దేవాలయం కలదు. ఈ దేవాలయం 400 ఏళ్ల క్రింద నిర్మించారని చరిత్ర చెబుతోంది. ఈ ప్రదేశంలో మూడు వాగులు కొండల మధ్య నుంచి ప్రవహిస్తూ ఏర్పడిన పవిత్ర సంగమంతో శివలింగం దర్శనమివ్వడంతో పూర్వికులు ఇక్కడ ఆలయం నిర్మించారని కథనం. ఈ ఆలయం దాదాపు 6 ఎకరాల స్థలంలో విశాలంగా నిర్మించారు. ఆలయం పక్కనే కోనేరు తాడిపత్రి చెట్టు ఎకరా భూమి స్థలం వెడల్పులో విస్తరించి ఆకర్శంగా నిలుస్తోంది. త్రివేణి సంఘమంగా ఏర్పడిన ఈ సంగమేశ్వర ఆలయంలో గోధుమ రంగులో ఉన్న శివలింగానికి అనేక మహిమలు ఉన్నాయని అర్చకులు చెబుతుంటారు. అభిషేకాలు చేసే సమయంలో ఈ లింగం కదులుతుందని అంటారు. ఆలయానికి వచ్చే భక్తులు ముడుపులు కట్టి స్వామివారిని దర్శించుకుంటారు.

భక్తుల కొంగు బంగారం..

కనకమామిడి సమీపాన గల సంగమ్వేరుడు భక్తులకు ఇలవేల్పుగా కొంగు బంగారంగా నిలుస్తున్నాడు. దీంతో భక్తులు ప్రతి సోమవారం ఈ స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి, గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలివస్తారు. ఇక్కడికి విచ్చేసిన భక్తులు సంగమేశ్వరుడి పక్కనే ఉన్న వేపచెట్టుకు ముడుపులు కట్టి వెళ్తారు. మొక్కుతీరిన తర్వాత భక్తులు ఇక్కడికి వచ్చి ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

ఉత్సవాలు ఇలా..

సంగమేశ్వర దేవాలయంలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు సంగమేశ్వర మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. 11న విష్వేశ్వర పూజ, గణపతి హోమం, రుద్రాభిషేకం, ధ్వజారోహనం, అగ్నిగుండాలు, 12న స్వామివారికి అభిషేకాలు, రథోత్సవం, 13న సత్యనారాయణ వ్రతాలు, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, నాటకాలు, భజనలు, 14న మహా మంగళ హారతి, శివ తీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆలయం వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



గర్భగుడిలో స్వామివారు

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

భారతీయ కిసాన్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి



సమావేశంలో పాల్గొన్న భారతీయ కిసాన్ సంఘం నాయకులు

చేవెళ్ల: రైతు సమస్యలను పరిష్కరించడంలో భారతీయ కిసాన్ సంఘం ముందుంటుందని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయం వద్ద సోమవారం భారతీయ కిసాన్ సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని తెలిపారు. రెవెన్యూ సమస్యలపై కూడా సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. ప్రతి గ్రామంలో సంఘం కమిటీలను వేసి రైతులకు అండగా ఉండాలన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. ప్రధానంగా రైతులకు వ్యవసాయశాఖ, విద్యుత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉంటాయని వీటిని ఎప్పటికప్పుడూ గుర్తించి పరిష్కరించేందుకు సంఘం నిరంతరం పనిచేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పెంటారెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి వీరేశం, సభ్యులు శివుడు, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విశ్వనాథం, దేవయ్య, మల్లేశ్, నర్సింహరెడ్డి, బాల్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.

నేడు వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణనతో పాటు ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీని మండల కేంద్రంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ తెలిపారు. కేశంపేట గ్రామంలోని వైఎస్సార్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఉదయం 9గంటలకు ర్యాలీని నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ పార్టీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలో మొదటిసారిగా కులగణన సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం చేయించిందన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. ఈ ర్యాలీలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గ్రామాల అభివృద్ధే బీజేపీ ధ్యేయం



పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ రాములుగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి

షాబాద్: మారుమూల గ్రామాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని కుమ్మరిగూడ మాజీ సర్పంచ్ నందిగామ రాములుగౌడ్, బీజేపీ సీనియర్ నాయకుడు కొత్తపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కుమ్మరిగూడలో ఎంపీ లాడ్స్ కింద రూ.5లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో షాబాద్ మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి బీజేపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు క్యామ నారాయణ, సింగప్పగూడెం నర్సింలు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ పదకొండవ ఓపెన్ టూ ఆల్ కబడ్డీ టోర్నమెంట్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ శివాజీ యూత్, బీజేపీ నాయకులు సోమవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆహ్వానపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని యూత్ అధ్యక్షుడు యాదగిరి తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు యాదయ్య, హరీశ్, రాజేశ్, రవికిశోర్, మాణిక్యం, జగదీశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం




కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామంలో భ్రమరాంబమల్లికార్జున స్వామివారి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రస్తాయం, ఎదుర్కోలు, కుంకుమార్చన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అందె భద్రప్ప, బాలలింగం, జ్యోతిర్లింగం, మహేశ్, చంద్రశేఖర్, సంగమేశ్వర్, అమ్రేశ్ పాల్గొన్నారు.


డ్రైనేజీ పనులు ప్రారంభం

కొత్తూరు: మండల పరిధిలోని మక్తగూడ గ్రామంలో డ్రైనేజీ పైప్‌లైను నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.4లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శేఖర్, నాయకులు రాందాస్‌నాయక్, రాజు, దయానంద్‌గుప్తా, మహేందర్, వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్, నర్సింహ, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఎస్‌ఐకి సన్మానం



బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ కృష్ణయ్యను సన్మానిస్తున్న సీఐ నర్సయ్య

కొందుర్గు: ఎస్‌ఐగా కృష్ణయ్య అందించిన సేవలు మరువలేనివని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య అన్నారు. బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ కృష్ణయ్యను పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అదేవిధంగా నూతన ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న రవీందర్‌నాయక్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ నర్సయ్య మాట్లాడారు. ఏడాదిన్నర సమయంలో కృష్ణయ్య విధుల్లో ఎంతో బాధ్యతాయుతంగా మెలిగారని, శాంతిభద్రతల విషయంలో చక్కగా వ్యవహరించారని కొనియాడారు. నూతన ఎస్‌ఐ అదేవిధంగా శాంతిభద్రతలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లేడ్ చౌదరిగూడ ఎస్‌ఐ విజయ్, పోలీసు సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి దేవాలయం

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఇందుకుగాను దేవాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు మంగళవారం ప్రారంభమై 15వ తేదీ శనివారం ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు(మంగళవారం) పోమాల్‌పల్లి గ్రామం నుంచి దేవతల ఉత్సవమూర్తుల విగ్రహాలను దేవాలయానికి తీసుకురావడం. 12వ తేదీ మధ్యాహ్నం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం, 13న రథోత్సవం, తేరు, సత్యనారాయణస్వామి వ్రతాలు, బండ్ల తిరుగుట, 14న చక్రతీర్థం, జాతర, 15న ఉత్సవమూర్తుల విగ్రహాలను పోమాల్‌పల్లి గ్రామానికి తీసుకెళ్లడంతో జాతర ముగుస్తుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు మండల ప్రజలతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని వారు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మండల అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న కేటీఆర్, సబితారెడ్డి

మొయినాబాద్‌రూరల్: పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో మొయినాబాద్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడిగా కేతిరెడ్డిపల్లి దారెడ్డి వెంకట్‌రెడ్డిని నియమిస్తూ మాజీ మంత్రులు కేటీఆర్‌తో పాటు సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. అనంతరం నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన దారెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ గెలుపే లక్ష్యంగా అందరితో కలిసి పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, రవియాదవ్, శ్యామ్‌రావు, షాబాద్ దర్శన్, జీవంతు, స్వప్న, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీహరి యాదవ్, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడిని ఖండిస్తున్నాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ తిరుపతిగా పేరొందిన చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం సరైంది కాదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ఒక వ్యక్తిపై కాదు.. ధర్మ పరిరక్షణపై దాడిగా భావిస్తున్నామన్నారు. ధర్మ పరిరక్షణ కోసం దేవాలయంలో ఉంటూ నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకుడిపై దాడి చేయడం సరైంది కాదన్నారు. నిందితులపై కఠిన చర్యలకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

అర్చకుడిపై దాడి అమానుషం

షాద్‌నగర్‌రూరల్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై శ్రీరామసేవ పేరుతో కొందరు వ్యక్తులు దాడికి పాల్పడటం అమానుషమని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ అనే సూక్తితో రాజ్యపాలనను కొనసాగించిన శ్రీరామచంద్రుని సైన్యం పేరు పెట్టుకొని ప్రధాన అర్చకుడిగా ఆత్మబోధన కార్యక్రమాలను చేపడుతున్న అర్చకుడు లక్ష్యంగా చేసుకొని దాడికి పాల్పడటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక సేవలకు విశ్వహిందూ పరిషత్ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడిపై జరిగిన దాడిని వీహెచ్‌పీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇలాంటి చర్యలను విశ్వహిందూ పరిషత్ సహించదని, దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రంగరాజన్‌కు పలువురి పరామర్శ

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని పలువురు రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. సోమవారం పలు సంఘాలు, పార్టీల నాయకులు చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి రంగరాజన్‌ను పరామర్శించారు. చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, కె.వెంకటరమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి వేర్వేరుగా వచ్చి రంగరాజన్‌ను పరామర్శించారు. భగవంతుడి సేవ చేసే అర్చకుడిపై దాడి చేయడం అమానుషమని మండిపడ్డారు. అదేవిధంగా భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు వివిధ ప్రజా సంఘాల నాయకులు దాడిని తీవ్రంగా ఖండించారు.

దాడిని ఖండిస్తున్నాం

రంగరాజన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వీరశైవ లింగాయత్ సమాజం మండల అధ్యక్షుడు, చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. దేవుని పేరుతో సంఘ విద్రోహ శక్తులు పుట్టుకురావడం సమాజానికి హానికరమన్నారు. ఇలాంటి శక్తులను వెంటనే అణిచివేయాలన్నారు. రంగరాజన్‌పై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

హిందూ సమాజంపై దాడిగా భావిస్తున్నాం: వీహెచ్‌పీ

అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని దేవాలయ వ్యవస్థపై, అర్చక వ్యవస్థపై, యావత్ హిందూ సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ పేర్కొంది. రంగరాజన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దాడికి పాల్పడ్డ సంఘ విద్రోహ శక్తులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరింది.

వలంటీర్‌కు వేతనం అందజేత



వలంటీర్‌కు వేతనం అందిస్తున్న రాజేశ్‌పటేల్

కొందుర్గు: కొందుర్గు దళితవాడ ప్రాథమిక పాఠశాలలో వలంటీర్‌గా పనిచేస్తున్న జ్యోతికి మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ సోమవారం వేతనం అందజేశారు. నెలకు రూ.3వేల చొప్పున 9 నెలలకుగాను రూ.27వేలు తన సొంత డబ్బులు ఆమెకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అనురాధ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసం తన సొంత డబ్బులతో వలంటీర్‌ను నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రత్నయ్య, ప్రభాకర్, సచిన్, ఎలీషా, వాసూరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులతో ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత చదువులతో మంచి భవిష్యత్ పొందాలని హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ రోజు 40 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలకు సంబంధించిన పరీక్ష సామగ్రి అందించారు. విద్యతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభివృద్ధికి ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక, మహేశ్వరి, శోభారాణి, జ్యోతి, సత్యనారాయణ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.